## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 25-07-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

❖ గత పది రోజులుగా జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు చేపట్టిన నిరసనల నేపథ్యంలో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు.

❖ తమ డిమాండ్లకు ప్రభుత్వం అంగీకరించడంతో నిరసనలు విరమిస్తున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రకటించింది.

❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 136వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.

❖ హరారేలో జరిగిన రెండవ టీ-20 క్రికెట్ మ్యాచ్‌లో జింబాబ్వేపై భారత్ విజయం సాధించి సిరీస్‌ను సొంతం చేసుకుంది.

=====================

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈరోజు తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సమర్పించారు. ఈ మేరకు ఆయన సామాజిక మధ్యమం 'ఎక్స్' వేదికగా.. యువత ఆకాంక్షలను తాను గౌరవిస్తున్నట్లు తెలిపారు. గత పది రోజులుగా విద్యార్థులు చేస్తున్న నిరసనల నేపథ్యంలో నెలకొన్న పరిస్థితి తనను తీవ్రంగా బాధించిందని, ఇది తన వ్యక్తిగత ప్రతిష్టకు సంబంధించిన విషయం కాదని పేర్కొన్నారు. నీట్-యూజీ పరీక్షలో జరిగిన అవకతవకలు వెలుగులోకి రాగానే.. సీబీఐ విచారణకు ఆదేశించామని, విజయవంతంగా మళ్లీ పరీక్షను నిర్వహించినట్లు తెలిపారు. యువశక్తే.. ఈ దేశ అసలైన శక్తి అని, వారి భవిష్యత్ కోసమే తాను రాజీనామా చేశానని తెలిపారు. దేశ యువతపై తనకు పూర్తి నమ్మకం ఉందని, విద్యార్థుల ఆకాంక్షలను గౌరవిస్తున్నానని, దేశ విద్రోహ శక్తులకు అవకాశం ఇవ్వకూడదనే రాజీనామా నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. దేశ సేవ తన జీవితంలో అత్యంత

ప్రాధాన్యత కలిగిన అంశమని, తాను దానికి అంకితభావంతో కొనసాగుతానని అన్నారు. మంత్రిగా ఇన్నాళ్లూ తనకు అవకాశం కల్పించిన ప్రధామంత్రి నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు అని ధర్మేంద్ర ప్రధాన్ తన లేఖలో పేర్కొన్నారు.

=====================

తమ డిమాండ్లకు ప్రభుత్వం అంగీకరించడంతో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తన ఆందోళనను విరమించింది. పరీక్షా విధానంలో సంస్కరణలు, ప్రశ్నా పత్రాల లీకేజీ నివారణ చర్యల వంటి సీజేపీ డిమాండ్లపై కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, డాక్టర్ జితేంద్ర సింగ్ ఈరోజు ఆ పార్టీ ప్రతినిధి బృందంతో మూడో విడత చర్చలు జరిపారు. న్యూఢిల్లీలో సీజేపీ ప్రతినిధి బృందంతో కలిసి నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో కేంద్రమంత్రి జేపీ నడ్డా మాట్లాడుతూ... నిరసనకారులపై ఎలాంటి చర్యలు తీసుకోబోమని, వారిపై ఎఫ్ఐఆర్‌లను నమోదు చేయబోమని తెలిపారు. ఒకవేళ ఇప్పటికే ఎఫ్ఐఆర్లు నమోదై ఉంటే.. వాటిని ఉపసంహరించుకుంటామని, ఆత్మహత్య చేసుకున్న వారి కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

(వాయిస్ 25 సెకన్లు)

కాగా.. అంగీకరించిన నిబంధనలు నిర్దేశించిన కాలపరిమితిలోగా అమలు చేయబడతాయని ఆశాభావం వ్యక్తం చేస్తూ.. సద్భావనతో ఆందోళనను విరమించుకుంటున్నట్లు సీజేపీ ప్రధాన అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ ప్రకటించారు. ప్రతి ఒక్కరూ శాంతియుతంగా తమ ఇళ్లకు తిరిగి వెళ్లాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

=====================

పురాతన బౌద్ధ క్షేత్రమైన సారనాథ్ యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో చేర్చబడింది. ఉత్తర ప్రదేశ్‌లోని సారనాథ్‌ను యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో చేర్చడాన్ని స్వాగతిస్తూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దీనిని ప్రతి భారతీయుడికి గర్వకారణమైన క్షణంగా అభివర్ణించారు. సారనాథ్‌కు బుద్ధ భగవానుడితో సన్నిహిత సంబంధం ఉందని, ఆయన అందించిన జ్ఞానం, కరుణ, సామరస్యం అనే సందేశం ప్రపంచానికి స్ఫూర్తినిస్తూనే ఉంటుందని సామాజిక మాధ్యమం వేదికగా ప్రధాని పేర్కొన్నారు. ఈ గుర్తింపు భారతదేశపు ప్రగాఢమైన నాగరిక, ఆధ్యాత్మిక వారసత్వాన్ని చాటిచెబుతున్నాయని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా మరింత మంది సారనాథ్‌ను సందర్శించి బుద్ధ భగవానుడి ఆదర్శాలతో మమేకం కావడానికి ఇది ప్రేరణను ఇస్తుందని ప్రధానమంత్రి అన్నారు. కాగా భారతదేశ సాంస్కృతిక వారసత్వానికి ఇది ఒక కీలక ఘట్టమని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెఖావత్ అభివర్ణించారు.

=====================

ప్రజా జీవితం, విద్యార్థుల సంక్షేమం పట్ల ధర్మేంద్ర ప్రధాన్ కు ఉన్న నిబద్ధతకు ఆయన దశాబ్ద కాల ప్రస్థానం ఒక నిదర్శనమని పార్లమెంటరీ వ్యవహారాల శాఖా మంత్రి కిరణ్ రిజిజు పేర్కొన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం ఆయన సామాజిక మధ్యమం వేదికగా స్పందిస్తూ ... ప్రధాన్ అంకితమైన సేవకు, సంస్కరణల పట్ల నిబద్ధతకు, బలమైన భారతదేశ నిర్మాణానికి చేసిన కృషికి ధన్యవాదాలు తెలియజేశారు. భారతదేశ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంలోనూ.. తీసుకునే ప్రతి నిర్ణయంలోనూ లక్షలాది మంది విద్యార్థులే కేంద్ర బిందువుగా ఆలోచించి ధర్మేంద్ర ప్రధాన్ చేస్తున్న ప్రయత్నాలను కిరణ్ రిజిజు అభినందించారు. అదే దృఢ సంకల్పంతో, చిత్తశుద్ధితో దేశానికి సేవ చేసే తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్న ధర్మేంద్ర ప్రధాన్‌కు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.

విరామం

=====================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 136వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. ఈ కార్యక్రమం

ఆకాశవాణి, దూరదర్శన్ నెట్‌వర్క్ అంతటా, AIR News వెబ్‌సైట్, News on air మొబైల్ యాప్‌లో ప్రసారమవుతుంది. అలాగే, AIR News, DD News, PMO.. సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖల YouTube ఛానెళ్లలో కూడా ఇది ప్రత్యక్ష ప్రసారం చేయబడుతుంది. హిందీ ప్రసారం ముగిసిన వెంటనే… ఆకాశవాణి ఈ కార్యక్రమాన్ని ప్రాంతీయ భాషల్లో ప్రసారం చేస్తుంది.

=====================

సభలో గడిపే ప్రతిక్షణాన్ని ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి ఉపయోగించుకోవాలని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ అన్నారు. న్యూఢిల్లీలో రాజ్యసభకు కొత్తగా నామినేట్ అయిన సభ్యుల కోసం రెండు రోజుల పాటు జరిగే ఓరియెంటేషన్-కమ్-ట్రైనింగ్ కార్యక్రమం ప్రారంభోత్సవంలో ఈరోజు ఉపరాష్ట్రపతి ప్రసంగిస్తూ... చర్చలు, సంప్రదింపులు ఎల్లప్పుడూ ఒక మంచి నిర్ణయానికి దారితీయాలని అన్నారు. ఆరోగ్యకరమైన చర్చ ప్రజాస్వామ్యాన్ని బలపరుస్తుందని, నిర్మాణాత్మక సహకారం దేశాన్ని ముందుకు నడిపిస్తాయని పేర్కొన్నారు. విజ్ఞానంతో కూడిన చర్చలు, సభ నియమ నిబంధనల పట్ల గౌరవం, ప్రశ్నోత్తరాల సమయం, జీరో అవర్‌ను సమర్థవంతంగా ఉపయోగించడం ద్వారా సభ అత్యున్నత సంప్రదాయాలను నిలబెట్టాలని ఆయన సభ్యులను కోరారు. రాజ్యసభ సభ్యులు ప్రజలచే నేరుగా ఎన్నుకోబడనప్పటికీ.. వారు ప్రజలతో సన్నిహితంగా ఉండాలని స్పష్టం చేశారు.

=====================

పార్లమెంటు వెలుపల పాత్రికేయులతో తాను చేసిన వ్యాఖ్యలను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI)ను ఉపయోగించి ఒక నకిలీ వీడియోను సృష్టించి ప్రచారం చేశారని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. తన వ్యాఖ్యలను దురుద్దేశపూర్వకంగా మార్ఫింగ్ చేసి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేశారని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కేంద్రమంత్రి సామాజిక మాధ్యమం వేదికగా ఈరోజు పేర్కొన్నారు. నకిలీ వీడియోను సృష్టించడం, ప్రచారం-వ్యాప్తి చేయడంలో పాల్పడిన ప్రతి ఒక్కరిపై కఠినమైన, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ఏఐని బాధ్యతారహితంగా దుర్వినియోగం చేయడాన్ని సహించబోమని కేంద్రమంత్రి స్పష్టం చేశారు. సమాచారం కోసం ధృవీకరించబడిన, ప్రామాణికమైన మూలాలను మాత్రమే విశ్వసించాలని ఆయన కోరారు.

=====================

భారతదేశపు మొట్టమొదటి హైడ్రోజన్ ఆధారిత రైలు 1,200 కిలోమీటర్లకు పైగా నిరంతరాయంగా ప్రయాణించి.. 3 వేల లీటర్లకు పైగా డీజిల్‌ను ఆదా చేసింది. ఈ నెల 17వ తేదీన జింద్, సోనిపత్ స్టేషన్ల మధ్య హైడ్రోజన్ రైలును ప్రారంభించారు. హైడ్రోజన్, ఆక్సిజన్ మధ్య జరిగే రసాయన చర్య ద్వారా ఈ రైలు విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుందని రైల్వే మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ ప్రక్రియ పొగ లేదా టెయిల్‌పైప్ కార్బన్ ఉద్గారాలు లేకుండా.. కేవలం నీటి ఆవిరిని మాత్రమే విడుదల చేస్తూ రైలు నడుస్తుంది. ఈ ప్రాజెక్ట్ భారతీయ రైల్వే స్వదేశీ పరిజ్ఞానం అని మంత్రిత్వ శాఖ తెలిపింది. జింద్-సోనిపత్ మార్గంలో కార్యకలాపాలు విజయవంతం అయిన అనంతరం.. ఢిల్లీ మార్గంలో త్వరలో ట్రయల్స్ ప్రారంభమవుతాయని తెలియజేసింది.

=====================

నకిలీ ఎయిర్ సువిధా 2.0 వెబ్‌సైట్‌ల పట్ల జాగ్రత్త వహించాలని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. కొన్ని మోసపూరిత వెబ్‌సైట్‌లు, పోర్టల్‌లు ఎయిర్ సువిధా 2.0 పేరుతో ప్రయాణికులను పేమెంట్ గేట్‌వేలకు మళ్లించి తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆ మంత్రిత్వ శాఖ తెలియజేసింది. ఎయిర్ సువిధా సేవలు ఉచితంగా అందించబడుతున్నాయని, స్వీయ-ధృవీకరణ పత్రాన్ని సమర్పించడానికి ఎలాంటి రుసుము అవసరం లేదని మంత్రిత్వ శాఖ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపింది.

=====================

జింబాబ్వేతో మూడు మ్యాచ్‌ల టీ-20ల సిరీస్‌లో భాగంగా హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా ఈరోజు జరిగిన రెండవ టీ-20లో బింబాబ్వే జట్టుపై భారత్ 90 పరుగుల తేడాతో విజయం సాధించి సిరిస్‌ను సొంతం చేసుకుంది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలలో 5 వికెట్లు కోల్పోయి 219 పరుగులు చేసింది. లక్ష్య చేధనలో బింబాబ్వే 17.5 ఓవర్లలో 129 పరుగులకు ఆలౌట్ అయ్యింది.

======================

======================